సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 8 । జనవరి । 2023



యురేనియం కలకలం
నల్లమలలో యురేనియం పరిశీలనకు బోరు డ్రిల్లింగ్ చేపట్టడంతో కలకలం రేగింది.

వివరాలు 10లో ▸



గుప్పుమంటున్న సారా
నాగర్‌కర్నూల్ జిల్లాలోని అటవీ గ్రామాల్లో సారా తయారీ జోరుగా సాగుతుంది.

వివరాలు 10లో ▸



వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. రాత్రి వేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న టీఎల్ఎం మేళా

కందనూలు: ఎఫ్ఎల్ఎన్ – 3 అమలులో భాగంగా ఈనెల 11న జిల్లా స్థాయిలో ప్రాథమిక ఉపాధ్యాయులకు టీఎల్ఎం మేళాను జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అందరూ ఎంఈఓలు, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారులు, క్లస్టర్ నోడల్ అధికారులు జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కందనూలు: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే, ఈమేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో బడి బయట పిల్లల వివరాలను సేకరించడం జరుగుతుందని డీఈఓ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా జనవరిలో ఈ సర్వే చేయనున్నట్లు, ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి 18వరకు జిల్లాలోని 57 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో గల సీఆర్పీలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఈఓల సహకారంతో కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయనున్నట్లు తెలిపారు. 6 – 14 ఏళ్లలోపు బడి బయట పిల్లల వివరాలను సేకరించి బడిలో చేర్పించనున్నట్లు తెలిపారు. అలాగే, 15 –19 సంవత్సరాల బడిబయటి పిల్లల వివరాలను సేకరించి కళాశాలలో చేర్పించాల్సి ఉంటుందని, బడి బయటి పిల్లల వివరాలను ప్రబంధ పోర్టల్లో ఈనెల 19 నుంచి 25 వరకు మండల స్థాయిలో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు 'కంటి వెలుగు'పై అవగాహన సదస్సు

నాగర్‌కర్నూల్ క్రైం: రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని మంతటి రోడ్డులోని తేజ కన్వెన్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని, వారితోపాటు జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022- 23, 2023- 24 రెండేళ్లపాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శిని నియామించేందుకు అర్హత గల పీడీ, పీఈటీలు మంగళవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నం.99487 87711ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఖైదీలకు ఎలక్ట్రీషియన్, టైలరింగ్‌లో శిక్షణ

పాలమూరు: ఖైదీల్లో మార్పు కోసం మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు అన్నారు. జిల్లా జైలులో జనశిక్షణ సమితి ఆధ్వర్యంలో పురుష ఖైదీలకు ప్లంబర్, వెల్డింగ్, ఎలక్ట్రీషియన్‌పై, మహిళా ఖైదీలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమం శనివారం జిల్లా జైలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే శిక్షణలో ప్రతి బ్యాచ్‌లో 20 మంది ఖైదీలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్స్‌ను జన శిక్షణ సమితి ఆధ్వర్యంలో సమకూరుస్తారని, శిక్షణ ముగిసిన తర్వాత సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రత్యేక శిక్షకుల ఆధ్వర్యంలో ఖైదీలకు శిక్షణ కొనసాగుతుందని అవసరమైన కుట్టు మిషన్లు, ఇతర పరికరాలు సమకూర్చడం జరిగిందన్నారు. సుబ్బారెడ్డి, వనజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జరభద్రం..!

జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు

- స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సాయంతో ఖాతాల్లో నగదు కొల్లగొడుతున్న వైనం
- అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్న ప్రజలు
- జిల్లాలో గతేడాది 409 కేసుల నమోదు



అచ్చంపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరిగిపోయాయి. కొందరి అమాయకత్వం.. మరికొందరి అత్యాశ.. వీటినే ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు బాధితుల బ్యాంకు ఖాతాల్లో నుంచి అందినకాడికి కొల్లగొడుతున్నారు. సైబర్‌నేరాలపై ఎంత అవగాహన కల్పించిన ప్రజల్లో మార్పు రాకపోవడంతో కొంత ఆందోళన కల్గిస్తుంది. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట అవగాహన కార్యక్రమాలు, సైబర్ నేరాలపై సూచనలు చేస్తున్నా కూడా ఎంతో మంది సైబర్‌నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారు. గత ఏడాది 409 సైబర్ నేరాలు పోలీస్‌పోర్టల్ ద్వారా నమోదు కావడాన్ని బట్టి చూస్తే వీటి తీవ్రత ఏంటో ఇట్టే అర్థమవుతుంది. అనవసర కాల్స్‌కు స్పందించ డంతో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం వంటి సామాజిక మాధ్య మాల అకౌంట్లలో వ్యక్తిగత వివరాలు షేర్ చేయడంతో సైబర్ నేరగాళ్లు తమ పనిని సులువుగా చేసుకునేందుకు ప్రజలు అవకాశం ఇస్తున్నట్లయింది. వ్యక్తి గత వివరాలను సేకరించిన సైబర్‌నేరగాళ్లు నకిలీ ఖాతాలను క్రియేట్ చేసి, వారితో పరిచయం పెంచుకొని మోసం చేస్తున్నారు.

చదువుకున్న వారే ఎక్కువ..

జిల్లాలో సైబర్‌నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్న వారిలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సాయంతో ప్రజల బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు. బ్యాంకు వివరాలు అప్‌డేట్ చేయాలంటూ లింక్‌లు పంపించి, లేదంటే ఎనీ డెస్క్‌లాంటి యాప్‌లు ఇన్‌స్టాల్ చేయించి మోసం చేస్తున్నారు. నిర్లక్ష్యరాస్యులు మాత్రం మోసపోతున్న కేసుల్లో ఎక్కువగా బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఏటీఎం బ్లాక్ అయిందని అలాగే సీఎంఆర్ ఫండ్ వచ్చిందనే సైబర్ కేసులు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి.

జిల్లాలో సైబర్ కేసుల వివరాలు..

ఏడాది	కేసులు	ఛేదన	పోయిన సొత్తు	రికవరీ చేసింది
2021	115	13	రూ.34.91లక్షలు	రూ.1.23లక్షలు
2022	409	73	రూ.1.28కోట్లు	రూ.20.91లక్షలు



రెండేళ్లలో నేరాలు ఇలా ..

2021 సంవత్సరంలో జిల్లాలో 115 సైబర్ నేరాలు నమోదు కాగా రూ.34,91,597 నగదును కొల్లగొట్టారు. 13 కేసులకు సంబంధించి రూ.1,23,379 నగదును ఫ్రీజ్ చేశారు. 2022 సంవత్సరంలో 409 సైబర్ నేరాలు నమోదుకాగా రూ1,28,76,585 నగదును కొల్లగొట్టారు. 73 కేసులకు సంబంధించి రూ.20,91,256 నగదును పోలీసులు ఫ్రీజ్ చేయగలిగారు. ముఖ్యంగా సైబర్ నేరాలు జరిగిన తర్వాత ఆలస్యంగా బాధితులు పోలిస్‌స్టేషన్లలో, పోలీస్‌పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేస్తుండటంతో అప్పటికే సైబర్‌నేరగాళ్లు నగదును డ్రా చేసుకుంటున్నారు. దీంతో సైబర్ నేరస్తుల ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేసినప్పటికి లాభం లేకుండా పోతుంది. వెంటనే 1930కు ఫోన్‌ద్వారా ఫిర్యాదుచేయాలని, అలాగ చేస్తే సైబర్ నేరగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేసి పోయిన నగదును రాబట్టేందుకు వీలవుతుందని పోలీసులు వెల్లడిస్తున్నారు.

జిల్లాలో కొన్ని ఘటనలు..

- డిసెంబర్ 17న తాడూరుకి వ్యక్తికి సైబర్‌నేరగాళ్లు బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఏటీఎం అప్‌డేట్ కోసం ఓటీపీ ఎంటర్ చేయాలని చెప్పడంతో అతడు ఓటీపీ ఎంటర్ చేయడంతో ఫోన్‌ను హ్యాక్ చేసి అతడి ఖాతానుండి రూ.6లక్షలకు పైగా నగదును డ్రా చేసుకున్నారు.
- డిసెంబర్ 25న అచ్చంపేటకు చెందిన వ్యక్తికి రూ.25లక్షలు లాటరీ తగిలిందని ఫోన్ చేసి ప్రాసెసింగ్ ఫీజు రూ.25వేలు చెల్లించాలని చెప్పడంతో అతడు నగదును చెల్లించి మోసపోయాడు.
- డిసెంబర్ 28న ఉప్పునుంతలకు చెందిన వ్యక్తి ముద్రలో లోన్‌కోసం రిజిస్టర్ చేసుకోవడంతో సైబర్‌నేరగాళ్లు గుర్తించి ఫోన్ చేసి రూ.7లక్షలు లోన్ మంజూరైందని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.78వేలు అడగడంతో అతడు చెల్లించి మోసపోయాడు.
- డిసెంబర్ 30న పెద్దముద్దునూరుకు చెంది న వ్యక్తికి లోన్ మంజూరైందని ఫోన్ చేసి ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలని చెప్పడంతో రూ.20వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి మోసపోయాడు.



శ్రీపురంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మోహన్‌కుమార్(ఫైల్)



బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు ఇవ్వొద్దు

సైబర్ నేరగాళ్ల భారిన పడిన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీకి ఫోన్ ద్వారా, లేదంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఖాతాలలో నగదును ఫ్రీజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అపరిచిత వ్యక్తులు ఎవరు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగిన ఎలాంటి సమాచారం అందించకూడదు. సైబర్ నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలిసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– మనోహర్, ఎస్పీ

సకాలంలో రేషన్ సరఫరా చేయాలి



సివిల్ సప్లయ్ గోదాములో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఓ మోహన్‌బాబు

పెద్దకొత్తపల్లి: జిల్లాలోని రేషన్ షాపులకు మండల స్థాయి గోదాముల నుంచి బియ్యాన్ని సకాలంలో సరఫరా చేయాలని డీఎస్ఓ మోహన్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములోని బియ్యం రికార్డులను పరిశీలించారు. మండలంలోని 37 షాపులకు గాను 31 షాపులకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేసినట్లు గుర్తించారు. మరికల్, ముష్టిపల్లి, దేదినేనిపల్లి, తిరుమలాపూర్, సాతాపూర్‌లోని రెండు షాపులకు బియ్యాన్ని త్వరితగతిన సరఫరా చేయాలని ఆదేశించారు. కొల్లాపూర్, అచ్చంపేట సివిల్‌సప్లయ్ పాయింట్లకు బియ్యాన్ని సాఫీగా సరఫరా చేయాలన్నారు. మండలంలో రేషన్ షాపులకు బియ్యం అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సకాలంలో బియ్యం సరఫరా చేసి మరోసారి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్‌తో పలు విషయాలపై ఆరా తీశారు. డీఎం బాలరాజు, డీటీలు రామ్మోహన్, నర్సింగరాజు, రవికుమార్‌లు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ఫీజు చెల్లించాలి

కందనూలు: ఓపెన్ స్కూల్‌లో 2022–23 సంవత్సరానికిగాను ఎస్సెస్సీ, ఇంటర్‌లో అడ్మిషన్ పొందే విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆపరాధ రుసుముతో అడ్మిషన్ ఫీజును మీసేవా ద్వారా చెల్లించాలని డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

నిధులొచ్చాయ్



తెలకపల్లి మండలం పెద్దపల్లిలోని రైతువేదిక



- జిల్లాలోని రైతు వేదికలకు రూ.64.35లక్షలు విడుదల
- ఒక్కో వేదిక నిర్వహణకు రూ.9వేల చొప్పున మంజూరు
- ఐదు నెలల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

నాగర్‌కర్నూల్: రైతుల వేదికలను నిర్మించిన పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదని వస్తున్న విమర్శలకు రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పెట్టనుంది. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు వీలుగా నిర్వహణ ఖర్చులకు నిధులను మంజూరు చేసింది. రైతుల కావాల్సిన సలహాలు, సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ప్రతీ క్లస్టర్‌లో రైతుల కోసం సమావేశాలు, ఇతరత్రా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రైతు వేదికలను ఏర్పాటు చేయడం జరిగింది. వీటి బాధ్యతలను సంబంధిత ఏఈఓలకు అప్ప గించారు. అయితే ఇన్ని రోజులు నిర్వహ ణకు సంబంధించిన నిధులు మంజూరు చేయకపోవడంతో పూర్తి స్థాయిలో రైతు వేదికలను వినియోగించలేకపోయింది ప్రభుత్వం. ఒక్కో వేదికకు రూ.9వేల చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. త్వరలో క్లస్టర్‌ల వారీగా నిధులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

జిల్లాలో 143 క్లస్టర్లు

జిల్లాలో రైతులకు సాగుపట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. జిల్లాలో 143 క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ప్రతీ క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించింది. అయితే అప్పట్లో భవన నిర్మాణాలతోపాటు మౌళిక వసతులైన కుర్చీలు, బల్లాలు, బీరువా, మైక్‌సెట్, విద్యుత్, ఇంటర్‌నెట్, స్టేషనరీ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతు వేదికలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. గతంలో ఈ విషయంలో ప్రభుత్వం పలు మార్లు హామీ ఇచ్చిన నెరవేర్చలేదు. ప్రస్తుతం ఈ నిధులు విడుదల చేయడంతో రైతులకు మరిన్నీ సేవలు అందించే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఒక్కో రైతువేదికలకు నెలకు రూ.9వేల చొప్పున ఒక్కో వేదికకు 5నెలల నిధులు రూ.45వేలు మంజూరు చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా తీసుకుంటే 143 రైతు వేదికలకు మొత్తం రూ.64.35లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ నిధులు విడుదలతో ఏఈఓలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుంది. రైతుల కోసం శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించడమే కాకుండా, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన మెళకువల గురించి వివరించాల్సి ఉంటుంది. విద్యుత్ చార్జీలు, శిక్షణ శిబిరాలు, ఇతరత్రా ఖర్చులకు ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసి సూచనలు చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు.

నిర్వహణ కోసం ఖర్చు చేయాలి



రైతువేదికల కోసం మంజూరైన నిధులు రైతు వేదికల మేయింటెనెన్స్ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి గతంలోనే నిధులు విడదల చేయడం జరిగింది. ఏఈఓల పరిధిలో ప్రతీ రైతువేదికకు వసతులను కల్పించేందుకు ఈ నిధులను వినియోగిస్తారు.

– వెంకటేశ్వర్లు, డీఏఓ

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని, బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో బీజేపీ బూత్ సమ్మేళనం నిర్వహించారు. వర్చువల్‌గా నిర్వహించిన సమ్మేళనంలో పలువురు పార్టీ ప్రధాన నాయకులు మాట్లాడారు. అనంతరం బంగారు శృతి మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీకి మంచి ఆదరణ ఉందన్నారు. గ్రామ గ్రామాన బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, బాబయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, రేణయ్య, మంగ్యానాయక్, జానకి, సతీష్ మాదిగ, గోపాల్‌యాదవ్, భరత్‌చారి పాల్గొన్నారు.

పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



ఏటీడీఏ ఏఓ జాఫర్ ఉసేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

మన్ననూర్: పోడు భూములను సాగుచేసుకుంటూ హక్కు పత్రాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న రైతులందరికి పోడు భూముల హక్కు పత్రాలు(ఎఫ్ఆర్‌సీ)ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్‌తో కలిసి మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జఫర్ ఉసేన్‌కు శనివారం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలో నాలుగున్నర లక్షల మంది హక్కు పత్రాల కోసం దరకాస్తు చేసుకోగా ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న 12,500 మంది రైతులు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేసే విధంగా తప్పుడు సమాచారం మేరకు 375 మంది రైతులను మాత్రమే అర్హులుగా గుర్తించి 666 ఎకరాలకే హక్కు పత్రాలు ఇవ్వాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. పోడు భూములను సాగు చేస్తూ ఎఫ్ఆర్‌సీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న గ్రామాలు, గూడాలలో సంబంధి అధికారులు పర్యటించి ఎఫ్ఆర్‌సీ కమిటీల సమక్షంలో సర్వే చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పదర మండల అధ్యక్షుడు దగ్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన బీజేపీ

అచ్చంపేట రూరల్: వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి నమ్మక ద్రోహం చేసిన బీజేపీ పార్టీకి మాదిగలంతా తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. శనివారం అచ్చంపేటలో టీఎన్‌జీఓ భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సొట కాశీం మాదిగ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జాతిని మోసం చేస్తున్న పార్టీలను వదిలేసి, సొంత రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి పార్లమెంట్‌లో బిల్లు సాధించుకోవడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాశీం, మహేష్, రమేష్, పవన్, రాంప్రసాద్, జగదీష్,వెంకటేష్,ఆంజనేయులు, అభిలాష్, సందీప్, విక్రమ్, ఉదయ్, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేష్

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన ఇక్బాల్‌ఖాన్‌కు రూ.60వేలు, మండలంలోని తండ్రాకి చెందిన అక్కమ్మకు రూ.56వేల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎజాస్, సురేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

కోడేరు: రైతుల భూసమస్యలు పరిష్కరిస్తామని ఆర్డీఓ హనుమనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రైతుల నుంచి 33 దరఖాస్తులు భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టాదారు పాసుబుక్కులో పేర్లు తప్పులున్నా.. మిస్సింగ్ సర్వే నంబర్లు ఉన్నా.. మీసేవలో దరఖాస్తులు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గోకారంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేష్ కుమార్

చారకొండ: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్ కూమార్ అన్నారు. మండలంలోని గోకారంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల పట్టా పొలాల పెండింగ్ సమస్యల పరిష్కరంగా రైతుల దరఖాస్తులను పరిశీలించారు. ధరణి పాస్ బుక్, డాటాకరేక్షన్, సర్వే నంబర్‌లో తప్పులు వాటిపై పరిశీలించారు. వాటిని త్వరలో పూర్తి వివరాలతో పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, సర్పంచ్ మధవి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, డీటీ విద్యాధరణి, ఆర్ఐ నబి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ చెందిన కొమ్ము మల్లయ్య(48) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ శనివారం తెలిపారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా డిసెంబర్ 31న ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి వికటించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య జయమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఉదండాపురంలో..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోకారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డె నర్సింహులు (30) మనస్తాపంతో శుక్రవారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి తిమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్య

మానవపాడు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంఘటన శనివారం మండలంలోని జల్లాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్లాపురం చెందిన మంగలి రాజు(33) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఆయన మానసిక స్థితి బాగా లేనందున శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులో గల ఆర్డీఎస్ కాల్వ సమీపంలో పురుగు మందు తాగి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందాడు. సంఘటనపై భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మానవపాడు: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బొలెరో వాహనంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సీతు (27) వెళ్తున్నాడు. కాగా మండలంలోని బోరవెల్లి శివారులో జాతీయ రహదారిపై బొలెరో వాహనం టైరు పంక్చర్ కావడంతో దాన్ని మారుస్తున్నాడు. వెనుక వైపు నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొనగా సీతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అలంపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో పాఠశాలలో విధులు నిర్వర్తించే కంప్యూటర్ ఆపరేటర్ అసభ్యంగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. గతంలోనూ ఆ వ్యక్తి ఇలాగే ప్రవర్తించినప్పటికీ పాఠశాలలోనే కొనసాగించారు. ఈ విషయమై పాఠశాల కరస్పాండెంట్‌ను వివరణ కోరగా విషయం వాస్తవమేనని, విధుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

యువతి అదృశ్యం

బాలానగర్: మండలంలోని సూరారం చెందిన యువతి శనివారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు.

విద్యుత్‌స్తంభం ఎక్కి వ్యక్తి హల్‌చల్

- గంటపాటు సరఫరా నిలిపివేత

కల్వకుర్తి టౌన్: మద్యం మత్తులో వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో వాసవీనగర్‌కు చెందిన వెంకట్ రెడ్డి మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కటంతో పట్టణంలో దాదాపుగా గంటపాటు సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతనిని సముదాయించి కిందకు దించారు. ఇదే విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఇతను గతంలో పలుమార్లు ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని, అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవటంతో ఇలా చేశాడని ఎస్ఐ తెలిపారు.

కేబుల్ వైర్ల చోరీ



ధరూరు: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని జాంపల్లి శివారులోని నెట్టెంపాడు కెనాల్ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను శుక్రవారం అర్ధరాత్రి తీసుకెళ్లారు. దాదాపు 20 మోటార్ల వైరును దొంగతనం చేశారు. పొలాలకు నీళ్లు పారించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

మళ్లీ గుప్పుమంటున్న సారా



నాటుసారాతో పట్టుబడిన వారితో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

- నల్లమల అటవీ గ్రామాల్లో జోరుగా తయారీ
- టార్గెట్లు, అవసరాలకు మాత్రమే దాడులు
- మామూళ్ల మత్తు వదలని అధికారులు

అచ్చంపేట: జిల్లాలోని అటవీ గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా జోరుగా నాటుసారా తయారీ జరుగుతోంది. ఎక్సైజ్‌శాఖ ప్రస్తుతం చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న గుడుంబా తయారీ, విక్రయాలు చాపకింద నీరులా మళ్లీ జోరందుకున్నాయి. దీనిని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుని తయారీదారులు రాత్రికి రాత్రి రిటేయిలర్స్‌కు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రం నుంచి బెల్లం దిగుమతి అవుతుండగా స్థానికంగా పటిక లభిస్తోంది. ఫలితంగా అటవీ గ్రామాల్లో గుడుంబా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. జిల్లాలోని అచ్చంపేట, లింగాల, అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల, బల్మూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లో ఎక్కువగా గుడుంబా తయారుచేస్తున్నారు. స్థానిక స్మగ్లర్లు వివిధ ప్రాంతాల నుంచి బెల్లాన్ని తీసుకొచ్చి తయారీదారులకు దిగుమతి చేస్తున్నారు. ఇందులో ఆయా మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు హైదరాబాద్, దేవరకొండ, కర్ణాటక రాష్ట్రాల నుంచి బెల్లాన్ని కొనుగోలు చేసి వివిధ వాహనాల్లో తీసుకొచ్చి రహస్య ప్రదేశాల్లో నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి నల్లమల ప్రాంతంలోని చోటా స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. జిల్లాకు బెల్లం వివిధ ప్రాంతాల నుంచి వస్తుండగా పటికను గుట్టుచప్పుడు కాకుండా కొందరు స్థానిక కిరాణా వ్యాపారులు విక్రయిస్తున్నారు. సారా తయారవుతున్న తండాలు, గ్రామాల గురించి ఎక్సైజ్ అధికారులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నెల టార్గెట్‌ల కోసం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దాడులు నిర్వహిస్తున్నాం..

గుడుంబాపై ఉక్కుపా దం మోపుతున్నాం. నిత్యం నిఘా పెట్టి రూట్‌వాచ్ చేస్తూ పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నాం. దొరికిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రెండోసారి దొరికితే బైండోవర్ చేసి జరిమానా కట్టిస్తున్నాం. పీడీ యాక్టు కూడా నమోదు చేస్తున్నాం. నిందితులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– కృష్ణయ్య, ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట

అడవులే అడ్డా..

ఎక్సైజ్ అధికారుల దాడుల నుంచి తప్పించుకునేందుకు గుడుంబా తయారీ అడ్డాను అడవుల్లోకి మార్చేశారు. గ్రామానికి సమీపంలో ఎవరూ వెళ్లలేని ప్రాంతాల్లో తయారుచేస్తున్నారు. పగలంతా కాచిన సారాను రాత్రి ఇంటికి తెచ్చి, అనంతరం విక్రయిస్తున్నారు.

ఊరూరా జాతర..

మద్యం ధరలు అమాంతం పెరిగిపోవడంతో చుక్క లేనిదే కంటిమీద కునుకుపట్టని మందుబాబులు గుడుంబాను తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకున్న తయారీదారులు రోజురోజుకూ గుడుంబా తయారీని పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో దుకాణాలకు గుడుంబా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకసీసా రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఎక్సైజ్ నిఘా ఉండడంతో గుడుంబా వ్యాపారం అంతా ఫోన్‌కాల్ మీద ఆధారపడి కొనసాగుతోంది.

నల్లమలలో యురేనియం కలకలం



నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న జిల్లా వాటర్ లెవలింగ్ అధికారి రమాదేవి

- బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

అమ్రాబాద్: నల్లమలలో మరోసారి యురేనియం కలకలం రేగింది. యురేనియం తవ్వకాలు, అన్వేషణకు వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ బోరు డ్రిల్లింగ్ సమయంలో మట్టి నమూనా సేకరణ చేస్తుండడంతో బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. శనివారం ఉదయం మండలంలోని తిర్మలాపూర్(బీకే) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మహారాష్ట్రకు చెందిన బోరు వాహనంతో డ్రిల్లింగ్ పనులు మొదలు పెట్టారు. ప్రతి మీటర్‌కు ఒకసారి మట్టి నమూనాలు కవర్లల్లో సేకరిస్తుండటంతో అనుమానం చెందిన గ్రామస్తులు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తోడు కావడంతో పనులు నిలిపి వేశారు. విషయం తెలుసుకున్న వాటర్ లెవలింగ్ జిల్లా అధికారి రమాదేవి గ్రామానికి చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 17వాటర్‌షెడ్ పథకాలు ఉన్నాయని నేషనల్ వాటర్ లెవలింగ్ అథారిటీ సూచనల మేరకు భూఅంతర్భాగం పొరలల్లో నీటి శాతాన్ని తెలుసుకునేందుకు బోరు వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటికే కల్వకుర్తి, వెల్దండ, చారగొండ తదితర మండలాల్లో 28బోర్లు వేసినట్లు వివరించారు. అయినా స్థానిక ప్రజలు వినలేదు. దీంతో డ్రిల్లింగ్‌ను పూడ్చివేసి బోరు వాహనాన్ని అక్కడి నుంచి పంపించారు.

యురేనియంపై ఆందోళన

2009 సంవత్సరం నుంచి పరిశీలించిన యురేనియం సర్వే ఆఫ్ ఇండియా అధికారులు 2011లో తిర్మలాపూర్(బీకే) గ్రామంలోనే 12బోర్లు వేసి మట్టి నమూనాలు సేకరించారు. ఈ ప్రాంత ప్రజలు బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకొని ఆపేశారు. తిరిగి మరోమారు డ్రిల్లింగ్ చేసి మట్టి నమూనాలు సేకరిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాల తీరు చూస్తే యురేనియం అన్వేషణ చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్త మవుతున్నాయని నల్లమల యురేనియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ నాసరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు యురేనియం తవ్వకాలకు ముందుకొస్తే అడ్డుకొని తీరుతామని నల్లమల అడవి, కృష్ణ జలాలను కాపాడుతామని తెలిపారు.



తిర్మలాపూర్(బీకే)లో బోరు డ్రిల్లింగ్ చేస్తున్న బోరు వాహనం

ఇథనాల్ కంపెనీ వద్దంటూ నిరసన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మరికల్: జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీటిని అనుమతి లేకుండా ఇథనాల్ కంపెనీ తీసుకెళ్తుందని, ఈ కంపెనీ తమకు వద్దంటూ నాలుగు గ్రామాల ప్రజలు శనివారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఆందోళనకు వస్తున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. దీంతో పోలీసుల, గ్రామస్తుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీకి పని చెప్పడంతో పలువురికి గాయాలయ్యాయి. మరింత ఆగ్రహంతో చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, రాంపూర్, కన్మనూర్, జిన్నారం గ్రామస్తులు కంపెనీకి వ్యతిరేకంగా ఎక్లాస్‌పూర్ స్టేజి వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులు వచ్చే వరకు రాస్తారోకను విరమించేంది లేదని మొండికేశారు. రైతులకు వచ్చే నీటిని అక్రమంగా కంపెనీకి తరలించవద్దని అడ్డుకుంటే తమపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని గ్రామస్తులు ప్రశ్నించారు. కంపెనీ వల్ల దాదాపు 50 గ్రామాలకు ముప్పు ఉందని, గతేడాది నుంచి ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదన్నారు. తమపై పెట్టిన అక్రమ కేసులు తొలగించి, కంపెనీ పనులు పూర్తిగా నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రామ్‌కోటి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారుల డిమాండ్లను తెలుసుకొని వారిని శాంతిపజేశారు.

పోలీసుల దౌర్జన్యం తగదు

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజలపై కేసులు పెట్టి నిర్బంధించడం తగదని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు జీవన్‌కుమార్, వసంత లక్ష్మి అన్నారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలన్నారు. ప్రజల అభిప్రాయల మేరకు కంపెనీ రద్దు చేయలన్నారు. సమావేశంలో బాలరాజు, రోహిత్, సంధ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

మట్టి టిప్పర్, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్, 4ఇసుక ట్రాక్టర్లను శనివారం మధ్యాహ్నం ఆర్డీఓ ఆదేశాల మేరకు వీఆర్ఏలు పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మండల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని డీటీ సరస్వతీ తెలిపారు. టిప్పర్‌ను అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం వద్దకు పంపినట్లు తెలిపారు. ఉప్పునుంతల శివారులోని కేఎల్ఐ కాల్వ వెంట మట్టిని కొన్ని నెలలుగా వ్యాపారులు అచ్చంపేటకు టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరుగేషన్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. మండలంలోని మొల్గర, సదగోడు సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు ప్రతి రోజు నడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు.



పట్టుబడిన మట్టి టిప్పరు, ఇసుక ట్రాక్టర్లు

బండలాగుడు పోటీల అడ్డగింత



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి

గట్టు: మండలంలోని ఆలూరులో ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను పోలీసులు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. జాతర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు క్రికెట్ టోర్నమెంట్, బీజేపీ నాయకులు బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 17 జతల ఎద్దులు ఆలూరుకు చేరుకున్నాయి. అయితే శనివారం పోటీలను ప్రారంభించే క్రమంలో గట్టు ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో వచ్చి బండలాగుడు పోటీలు ఆపాలని కోరారు. దీంతో బీజేపీ నాయకులు గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడికి పోటీలను ప్రారంభించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు మరోసారి అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్దేశ పూర్వకంగానే బండలాగుడు పోటీలను అడ్డుకున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ బండలాగుడు పోటీలు నిర్వహించే స్థలం కోర్టు వివాదంలో ఉన్నందున అభ్యంతరం చెప్పామని, అనుమతులు తీసుకుని మరోచోట నిర్వహించుకుంటే తమకెలాంటి అభ్యంతరం చెప్పారు. మొత్తంగా బండలాగుడు పోటీలు నిర్వహించకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దుల యజమానులు నిరాశతో వెనుదిరిగారు.

ఆకస్మికంగా రైతు మృతి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో వ్యవసాయ పొలంలో ఎరువులు చల్లడానికి వెళ్లిన రైతు ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన బండారి బుచ్చన్న(59) శనివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలంలోని కరిగెటలో ఎరువులు చల్లడానికి వెళ్లాడు. పొలం వద్దనే బహిర్భూమికి వెళ్లిన బుచ్చన్న కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత పెద్ద కుమారుడు కురుమూర్తి ఎరువులను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. కుప్పకూలిన తండ్రిని చూసి వెంటనే కొత్తకోటలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కుర్మక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లిన రైతు విగతజీవిగా ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీరని విషాదంలో మునిగిపోయారు.

పత్తి పంట తొలగించుకోండి

అలంపూర్: బీటీ సాంకేతిక పరిజ్ఞానం రాక ముందు పత్తిని వివిధ రకాల కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరిచాయి. 2002లో వచ్చిన బీటీ సాంకేతిక పరిజ్ఞానంతో కాయ తొలుచు పురుగుల ఉధృతి తగ్గిందని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు పూర్తి కావడంతో పొలాల్లో పంటను తొలగించాలని సూచించారు. పత్తి పంట తొలగించిన తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు వివరించారు.

గులాబీ పురుగు

గులాబీ రంగు తల్లి పురుగు లేత ఆకుల కింది భాగాన లేత కొమ్మలపై, పూమొగ్గలపైన, లేత కాయాలపైన గుడ్లను విడివిడిగా 150 నుంచి 200 వరకు పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన పిల్ల పురుగులు పూ మొగ్గలోకి తొలుచుకొని పోయి లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలకు కనిపించనంత చిన్న రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. తర్వాత కాయలకు చేసిన రంధ్రాలు పూడిపోయి పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతినడమే కాకుండా దూది బరువు తగ్గుతుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడపడం వలన కాయ పగిలిన తర్వాతనే నష్టాన్ని గుర్తించగలం. పురుగులు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి.

నివారణ చర్యలు

సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించి గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ప్రధానంగా పంట తీసిన తర్వాత పంట లేని సమయాన, విత్తడానికి ముందు, పంట కాలంలో వివిధ చర్యలు చేపట్టాలి.

పంట తీసిన తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలు, మేకలు, పశువులను మేపాలి. పత్తి మోళ్లను ట్రాక్టర్ రోటోవేటర్‌తో భూమిలో కలియ దున్నాలి. నీటి వసతి ఉన్నప్పటికి పత్తిని 6నెలలు మించి పొడగించకుండా తీసి వేయాలి. పంట కాలం పొడగించుట ద్వారా రాబోయే పంటలో పురుగు ఉధృతి పంట తొలి దశలోనే ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. నీటి వసతి ఉన్న చోట రెండవ పంటగా ఆరుతడి పంటల్ని సాగు చేసుకోవాలి. పత్తి మోళ్లను ఇళ్ల వద్ద పొయ్యిలో వాడేందుకు నిల్వ చేయకూడదు. పత్తి తీసిన తర్వాత ఎండిన మోళ్లను విచ్చుకోని కాయలను భూమిలో కలియ దున్నుట ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చును.

పత్తి విత్తడానికి ముందు, పంట కాలంలో..

పంట మార్పిడి పద్ధతిని రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. తక్కవ కాల పరిమితిగల రకాలను ఎంపిక చేసుకుని సకాలంలో విత్తుకోవడం ద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. బీటీ పత్తి విత్తే సమయాల్లో చుట్టూ 5 వరుసల్లో నాన్ బీటీ పత్తిని విధిగా విత్తుకోవాలి. పత్తి పొలం, చేను చుట్టూ తుత్తురు బెండలాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పత్తి పంట దగ్గరలో బెండ పంట ఉండరాదు. పత్తి పంట విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి వరుసగా బుట్టలలో మూడు రోజులు 7 లేదా 8 తల్లి పురుగులు పడటం గమనిస్తే, 10 శాతం గుడ్డి పువ్వులు లేదా 10 శాతం పురుగు ఆశించిన కాయలను గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే నివారణకు మందులు పిచికారి చేసుకోవాలి. 5 శాతం వేప గింజల కషాయం లేదా 5 మి.లీ (1,500 పీపీఎం) వేప నూనెను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. క్వినాల్‌ఫాస్ 2.0 లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా కోరోపైరిఫాస్ 2.5. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పంట కాలంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్‌మెత్రిన్ 25 శాతం ఇ.సీ ఒక మి.లీ లేదా లామ్డాసైహలోత్రిన్ 5 శాతం ఇ.సి 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పత్తి పంటపై ఎక్కువ సార్లు పిచికారి చేసినట్లయితే రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది.



కోత కోసిన పత్తి పంట

పంట లేని సమయాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

ఎండాకాలంలో లోతు దుక్కులు చేసుకోనుట ద్వారా పురుగు యొక్క కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చు. గులాబీ రంగు ఆశించిన పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చిన విత్తనాలను నిల్వ చేయకుండా నాశనం చేయాలి. లేకుంటే తర్వాత పంట కాలంలో దీని ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. గులాబీ రంగు ఆశించిన పత్తిని రైతుల ఇళ్ల వద్దగాని లేదా జిన్నింగ్ మిల్లుల వద్దగాని నిల్వ ఉంచరాదు.

క్లుప్తంగా

13 నుంచి మండలస్థాయి కబడ్డీ పోటీలు

లింగాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని వల్లభాపూర్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాజీ ఉప సర్పంచ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతల సహకారంతో విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోటీలో పాల్గొనే జట్లు ఈ నెల 10వ తేదీ లోపు జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9121488412 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అంబట్‌పల్లిలో కబడ్డీ పోటీలు

మండలంలోని అంబట్‌పల్లిలో ఈ నెల 13వ తేదీ నుంచి గ్రామ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు భాస్కర్, శివారెడ్డి, ఎ.వెంకటేష్, జి.వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే జట్లు ఈ నెల 11వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహించే ఈదమ్మ మాందాత ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో స్థలం తక్కువగా ఉండటంతో బండ్లు, బోనాలు తిరగడానికి ఇబ్బందిగా ఉందని గ్రామానికి చెందిన వారి నుంచి స్థలాన్ని ఇవ్వాలని కోరారు. వారి ఇంటి నిర్మాణ గోడలు ఉండటంతో వాటిని తొలగించడానికి వారి నుంచి అనుమతి తీసుకున్నారు. వారికి మరో చోట స్థలాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, రామచంద్రయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు



లింగాల: యాసంగిలో సాగుచేసిన వేరుశనగ పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని శాయిన్‌పేట శివారులో యాసంగిలో సాగుచేసిన వేరుశనగ పంటను ఏఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 9,850 ఎకరాల్లో పంటను సాగుచేశారని తెలిపారు. ప్రస్తుతం పంట పూత దశ నుంచి ఊడలు దిగి కాయలు ఏర్పడే దశలో ఉందని తెలిపారు. ఈ సమయంలో లద్దె పురుగు పంటను ఆశించి నష్ట పరుస్తుందన్నారు. లద్దె పురుగు నివారణకు వ్యవసాయ శాఖ సూచించిన మందులను వాడాలన్నారు. యాసంగి వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన మినుములు, పెసర్లు, బొబ్బర్లు, నువ్వులు తదితర పంటలపై దృష్టి సారించాలని సూచించారు.

మొక్కలను సంరక్షించాలి



పెద్దకొత్తపల్లి: జిల్లాలోని రైస్ మిల్లుల వద్ద నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత మిల్లు యజమానులదేనని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర మాడ్రన్ రైస్ మిల్లు వద్ద, పెద్దకార్పాములలో మారుతీ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైస్ మిల్లుల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలతో పాటు టేకు, ఎర్రచందనం మొక్కలు నాటుకోవాలని సూచించారు. నాటిన మొక్కలు చనిపోకుండా చూసే బాధ్యత మిల్లర్ యజమానులపై ఉందని అన్నారు. డీఎస్ఓ బాలరాజు, డీటీలు రామ్మోహన్, నర్సింగరాజు, రవికుమార్ మిల్లు యజమానులు సాయిరాజు, నవీన్‌కుమార్, పెద్దకార్పాముల సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వజ్రలింగం, శివయ్యలు ఉన్నారు.

ఇంటిపన్ను తగ్గించాలి

కొల్లాపూర్: మున్సిపాలిటీలో ఇంటి పన్నులను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ నాగశేషియాదవ్‌కు వినతి అందజేశారు. అధిక పన్నులతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని విలీన గ్రామాల్లో ప్రజలు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారిపై అధిక పన్ను భారం మోపడం సరికాదన్నారు. ఈశ్వర్, శివవర్మ, సలీమ్, మహిమూద్, భాస్కర్‌నాయక్ తదితరులున్నారు.

ఆర్డీటీ ఆదుకుంటుంది..

- మెరుగుపడిన చెంచుల జీవనం
- ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన సంస్థ
- విద్య, వైద్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యార్థుల చదువుకు సహకారం



తండాలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన అధునాతన చెంచుల ఇళ్లు

ఉప్పునుంతల: పాలకుల పట్టింపులేక, ప్రభుత్వ సాయానికి నోచుకోక తమ తాతల కాలం నాటి నుంచి కటికచీకటిలో మగ్గిన మండలంలో మారుమూలన ఉన్న సీబీ తండా చెంచులకు మంచి రోజులు వచ్చాయి. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారం, ప్రోత్సాహంతో చెంచుల జీవన విధానంలో ఎంతో మార్పు వచ్చింది. ఆర్డీటీ సంస్థ ఉచితంగా చెంచులకు ఇళ్లను నిర్మించి ఇవ్వడంతో పాటు వారి విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చేపడుతుంది.

పాత ఇళ్లను పడగొట్టి..

ఈ తండాలో గతంలో ప్రభుత్వ నుంచి నాసిరకంగా నిర్మించి ఇచ్చిన ఇళ్లను పడగొట్టి వాటి స్థానంలోనే ఆర్డీటీ సంస్థ నుంచి 24 ఇళ్లను కొత్తగా నిర్మించి ఇచ్చారు. ఒక్కో ఇంటికి రూ.2.30 లక్షలు ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణంలో చెంచులను భాగస్వామ్యులను చేస్తూ నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా జాగ్రత్తపడి ఇళ్లను నిర్మించి ఇచ్చారు. కొంత మంది స్థానికంగా వ్యవసాయం చేసుకుంటుండగా.. మరికొంత మంది ఇటీవలే ఇటుకలు చేయడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లారు.

వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ..

దాంతోపాటు సంస్థ నుంచి వెంకటమ్మ అనే చెంచు మహిళకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా శిక్షణ ఇచ్చి చెంచులకు జ్వరం వచ్చినా, అనారోగ్యానికి గురైనా ప్రాథమికంగా వాడాల్సిన కొన్ని మాత్రలను ఆమె వద్ద ఉంచి వైద్యంపై తగు శ్రద్ధ తీసుకుంటున్నారు. తండాలో వారానికి ఒక సారి మొబైల్ క్లినిక్‌ను నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. స్థానికంగా వ్యాధి నయంకాని రోగులను సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మన్ననూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు అంబులెన్స్‌లో తీసుకెళ్లి చికిత్సలు చేయిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలతో పాటు చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ.. చెంచులను శారీరక పుష్టితోపాటు ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు కృషి చేస్తున్నారు. రాగి అంబలి, గుడ్లు, పెసల్లు వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

విద్యార్థులకు చేయూత..

చెంచు విద్యార్థులను ఇంటర్ నుంచి ఉన్నత చదువుకోసం సంస్థ సొంతంగా డబ్బులు పెట్టి కార్పొరేట్ కళాశాల్లో చదివించడంతో ప్రస్తుతం చెంచు విద్యార్థులు సైదమ్మ, ఇదయ్య పీజీ చేస్తున్నారు. ఆ విద్యార్థులను ఇంటర్ నుంచి సంస్థ వారే ఫీజులు చెల్లించి కార్పొరేట్ కళాశాల్లో చదివించారు . గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న చెంచు విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్నారు.

కన్న బిడ్డల్లా చూసుకుంటున్నారు..



మా తాతల నాటి నుంచి మమ్ములను ఎవ్వరూ పట్టించుకోలేదు. గతంలో ప్రభుత్వం నుంచి నాసిరకం ఇళ్లను నిర్మించి ఇచ్చారు. వర్షం వస్తే అవి పొటుకుపెట్టేవి. ఇళ్లకు తలుపులు కూడా బిగించకుండా ఇచ్చారు. ఐదేళ్ల కిందట ఆర్డీటీ సంస్థ వారు పాత ఇళ్లను పడగొట్టించి వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించి ఇచ్చారు. మాకు ఏ ఆపతి వచ్చినా వారే ఆదుకుంటున్నారు.

– నల్లబోతుల పెద్దులు, సీబీ తండా

ముమ్మరంగా బడిబయటి పిల్లల సర్వే



బడిబయటి పిల్లలతో ఉపాధ్యాయులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బడిబయటి పిల్లల సర్వే ముమ్మరం చేశారు. శనివారం ఆ గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుల సహాయ సహకారంతో బడిఈడు కలిగి బడిబయట ఉన్న పిల్లల వివరాలు సేకరించారు. బడి ఈడు కలిగిన ప్రతి పిల్లలు బడిలో ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో వలస వచ్చిన ఇద్దరు విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. పాఠశాలలోనే ఉండి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని, విద్యతోనే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు వెంకటయ్య, సీఆర్‌పీ నరేందర్‌లు ఉన్నారు.

బహుజన సమాజాన్ని రక్షించుకుందాం..



నియామక పత్రం అందజేస్తున్న బాబు నాయక్

కల్వకుర్తి రూరల్: బహుజనుల రక్షణ కోసమే బహుజనుల వాలంటరీ ఫోర్స్ పని చేస్తుందని బహుజన సమాజ్‌పార్టీ కోకన్వీనర్ బాబు నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు సమక్షంలో బీవీఎఫ్ కన్వీనర్‌గా శ్రీశైలం, కోకన్వీనర్‌గా రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడారు. ఎన్నికల ముందు పార్టీలు మందు, డబ్బులు పంపిణీ చేస్తారని, వాటిని అడ్డుకుని ఎన్నికలు సక్రమంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చూడటం బహుజనుల వాలంటరీ ఫోర్స్ ప్రధాన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, భరత్, భాస్కర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు హింసకు గురికావొద్దు



బాలికల సాధికారత క్లబ్ సభ్యులతో కలిసి వివరిస్తున్న ఎస్‌ఐ తిరుపతిరెడ్డి

అమ్రాబాద్: బాలికలు హింసకు, లైంగిక వేధింపులకు, గృహహింసకు గురికాకుండా ముందుకు వచ్చి మనోధైర్యంతో చదువుకునే సమాజం ఏర్పడాలని ఎస్‌ఐ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల సాధికారత క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌ఐ తిరుపతిరెడ్డి మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారే పరిష్కరించుకునేలా ఈ సాధికారత క్లబ్‌లు ఉపయోగపడుతాయని వివరించారు. అనంతరం ప్రతి తరగతికి ఇద్దరు చొప్పున బాలికలను సాధికారత క్లబ్ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం బాలకిషన్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవీందర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై తహసీల్దార్‌కు వినతి



వినతి అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తెలకపల్లి: భూ ఆక్రమణపై బీఎస్పీ నాయకులు శనివారం తహసీల్దార్ సబితకు వినితిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని 497 సర్వే నంబర్‌లోని భూములను కొందరు నాయకులు ఆక్రమించి అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టారని బీఎస్పీ నాయకులు రెడ్డపాకుల శివశంకర్ ఆరోపించారు. దళితులకు సంబంధించిన భూములను కొందరు నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కబ్జాలకు గురవుతున్న స్థలాలపై అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే భూకబ్జాలకు గురైన దళితుల స్థలాలను వారికి అందజేయాలని, లేకుంటే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శివశంకర్‌తో పాటు బాలు, రాము, రాజేశ్, శ్రీను, సందీప్, వెంకటయ్య, రాము, శివ, సురేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ కృషి ఎంతో ఉందని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో వివిధ పాఠశాలల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు ఈ నెల చివరి వరకు పూర్తవుతాయన్నారు. 317 జీఓతో జరిగిన నష్టాలను ముగించేందుకు పీఆర్‌టీయూ కృషి చేస్తుందని అన్నారు. శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్‌రావు, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, షాకీర్‌బాష, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కోడేరు: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేలా పీఆర్‌టీయూ కృషి చేస్తుందని అన్నారు. అనంతరం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంచందర్‌రావు, బాబురావు, బాలకిష్టయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను మండల నోడల్ అధికారి తిరుపతయ్య, ఎంఈఓ భాస్కర్‌రెడ్డిలు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలోని పలు రికార్డులు పరిశీలించి పాఠశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులన్నీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఎఫ్‌ఎల్‌ఎం శిక్షణలో నేర్చుకున్న వివరాలన్నింటిని పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు.

రైతుల నిరసన



తెలకపల్లి: మండల పరిధిలోని ఆలేరుకి చెందిన రైతులు శనివారం గ్రామపంచాయితీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతుల భూ సమస్యలపై అధికారులు గ్రామంలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ రకాల భూసమస్యలు పరిష్కరిస్తామని చెప్పి తీరా అధికారులు రాకపోవడంతో నిరసన వ్యక్తం చేశామన్నారు. వివిధ ప్రాంతాల్లోని రైతులు గ్రామానికి చేరుకున్నా.. చివరకు రెవెన్యూ అధికారులు గ్రామానికి రాకపోవడంతో అధికారుల తీరుపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా తమ గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అవగాహన అవసరం



కల్వకుర్తి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి కుమారస్వామి అన్నారు. శనివారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఈ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి కుమారస్వామి బాల్యవివాహాల చట్టంతో పాటు మహిళలు, విద్యార్థులకు రక్షణగా ఉన్న చట్టాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెజిటెడ్ డైరీ, నాన్‌గెజిటెడ్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



నాగర్‌కర్నూల్ క్రైం: నూతన సంవత్సర గెజిటెడ్ డైరీ, నాన్ గెజిటెడ్ టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా సహకార అధికారి పత్యానాయక్ శనివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాల నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. జిల్లా ఆడిట్ ఆఫీసర్ రఘునాథ్‌రావు, రవికుమార్, ట్రెజరర్ మధు, గోవర్దన్, పురుషోత్తం పాల్గొన్నారు.

‘ఒక్కసారి అవకాశం ఇవ్వండి’



మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

పెంట్లవెల్లి: ప్రగతి కోసం పాదయాత్ర కార్యక్రమం శనివారం మండల కేంద్రం చేరుకుంది. సుధాకర్‌రావుకు పెంట్లవెల్లి మహిళలు, ప్రజలు, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పెంట్లవెల్లిలోని బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి బూతు స్థాయిలో గడపగడప తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం 8 గంటలకు కొత్తబస్టాండ్‌లో దూందాం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కొల్లాపూర్ గెలిచిని ప్రతి ఎమ్మెల్యే పార్టీలు మారడమే తప్ప అభివృద్ధి చేసిందేమిలేదన్నారు. వారి స్వార్థం కోసం ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని గెలిచిన తరువాత ప్రజలను మోసం చేసిన నాయకులే అని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. మీ సమస్యలను అర్థం చేసుకుని నేను వాటిని పరిష్కరిస్తానని, మీ ముందుకు వస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ గ్రామానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అలాంటి వారిని మళ్లీ నమ్మవద్దన్నారు. మరో నాయకుడు మాజీ మంత్రి జూపల్లి 5 సార్లు అధికారంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. ఒక్క సారి అవకాశం ఇస్తే కొల్లాపూర్‌ను అభివృద్ధి చేస్తానని అన్నారు. జిల్లా నాయకులు మూలె భరత్‌చంద్ర, ప్రసాద్, రోజారమణి, శ్రీనివాస్‌యాదవ్, ఖలీల్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కోడేరు: జిల్లాలోని రైతుల ధరణి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ హనుమనాయక్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణి వచ్చినప్పటి నుంచి రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో ఎక్కక పేర్లు తప్పులు, మిస్సింగ్ సర్వే నంబర్లతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై రైతులు ధర్నాలు, ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే అధికారులు స్పందించి భూసమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని సాదాబైనామాలను, అటవీ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రైతు సమస్యలు పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడ్తామని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందజేశారు. కార్యక్రమంలో శివశంకర్, ఎల్లస్వామి, లింగమయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించం’



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

నాగర్‌కర్నూల్ క్రైం: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులపై అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ కల్పన అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. ఇతర పార్టీల్లోని సర్పంచ్‌లను, నాయకులను కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేసి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంటున్నారనేది అవాస్తవమని అన్నారు. 30 ఏళ్లలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి చేయలేని అభివృద్ధిని కేవలం 8 ఏళ్లలో మర్రి జనార్దన్‌రెడ్డి చేసి చూపారని అన్నారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే నాగం అనుచరులు చేసిన అవినీతి గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బాదం రమేష్, భాస్కర్‌గౌడ్, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌లో శనివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా దేవాలయాల వద్ద పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతుగా సాయం అందిస్తామన్నారు. ఐక్యత ఫౌండేషన్ పేద ప్రజలకు సాయం అందిస్తుందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, స్వయం ఉపాధి రంగాలకు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కోచింగ్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు గ్రామస్తులు రాఘవేందర్‌రెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామచంద్రయ్య, గోపాల్‌నాయక్, నాయకులు భాషగౌడ్, భీమరాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



అచ్చంపేటలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జర్నలిస్టులు

అచ్చంపేట రూరల్: హైదరాబాద్ పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించే టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర మహాసభలకు నల్లమల నుంచి జర్నలిస్టులు భారీగా తరలిరావాలని ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, అచ్చంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లావుడ్య చందునాయక్ పిలుపునిచ్చారు. శనివారం అచ్చంపేట ప్రెస్‌క్లబ్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 8న యూనియన్ రాష్ట్ర మహాసభలు, 9, 10న ఆల్ ఇండియా జర్నలిస్టు యూనియన్ ప్లీనరీ సమావేశాలు కొనసాగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సాయిబాబు, జహంగీర్, వెంకటేష్, బాలీశ్వర్, సుధాకర్, చంద్రమౌళి, రవీందర్‌గౌడ్, శ్రీనుయాదవ్, రామలింగయ్య, వెంకటయ్య, శివ, ఎక్బాల్ పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: పఠాన్‌చెరులో ఆదివారం నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్లను శనివారం కొల్లాపూర్‌లో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మహాసభలకు యూనియన్ సభ్యులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేషయ్య, సభ్యులు రామకృష్ణ, వెంకటస్వామి, ముస్తాఖ్, సత్యనారాయణ, వినోద్, కేశవులు, సురేష్, నర్సింహ తదితరులున్నారు.

క్లుప్తంగా...

మార్చి 5న ఏఈ అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఫిబ్రవరి 12వ తేదీన జరగాల్సిన అర్హత పరీక్షను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఆ రోజు గేట్ పరీక్షలు జరగనున్నట్లు అభ్యర్థులు విన్నవించడంతో పరీక్ష తేదీని వాయిదా వేయాలని కమిషన్ నిర్ణయించింది. మార్చి 5వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.

టీచింగ్ సిబ్బందిని నేరుగా నియమించండి

ఆయుర్వేద వైద్య కళాశాలపై కేసులో సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బోధనేతర సిబ్బందిని టీచింగ్ పోస్టుల్లో భర్తీ చేయడాన్ని ఆపాలని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆయుర్వేద వైద్య సర్వీసుల నిబంధనలను మారుస్తూ ఖాళీ పోస్టులను నేరుగా భర్తీ చేయకుండా..అంతర్గత బదిలీలు చేయడాన్ని ఆపాలని కోరుతూ వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ నీలిమాతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 18 ఏళ్లుగా ఆయుర్వేద కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శితో పాటు మరో 17 మందిని ప్రతివాదులుగా చేర్చారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం..నాన్ టీచింగ్ కేడర్ ఉద్యోగులను టీచింగ్‌లో భర్తీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌ను సస్పెన్షన్‌లో పెట్టిన ధర్మాసనం..నేరుగా భర్తీ చేయాలని సూచించింది.

జేఎల్ నోటిఫికేషన్‌లో వయో పరిమితి పెంచండి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ లెక్చరర్ (జేఎల్) నియామకపు నోటిఫికేషన్‌లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు వయో పరిమితి 52 ఏళ్లకు పెంచాలని తెలంగాణ (కాకతీయ) ప్రైవేటు కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా జేఎల్ నోటిఫికేషన్ లేకపోవడంతో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం చూస్తున్నారని, ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేద్దామంటే వయో పరిమితి దాటిపోవడంతో నోటిఫికేషన్ అర్హత సాధించలేకపోతున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

వెండి చీరను ఆవిష్కరించిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల నేత కళాకారుడు నల్లా విజయ్ మగ్గంపై నేసిన సువాసనలు వెదజల్లే వెండి చీరలను మంత్రి తారక రామారావు శనివారం ఆవిష్కరించారు. చీర తయారీకి దాదాపు నెలన్నర రోజుల సమయం పట్టిందని విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఇప్పటి వరకు విజయ్ నేసిన వస్త్ర ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అతని కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. తెలంగాణ నేతన్నల అనితర సాధ్యమైన, అద్భుతమైన ప్రతిభకు విజయ్ నిదర్శనమని, ఆయన సిరిసిల్లకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయ్‌కు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.



నల్లా విజయ్ మగ్గంపై నేసిన వెండి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఇక్కడ డిపాజిట్ల కంటే రుణాలు ఎక్కువ

- తెలంగాణలో బ్యాంకుల పనితీరు భేష్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- కేంద్ర పథకాలతో పేదల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం
- వివిధ వర్గాలకు బ్యాంకుల నుంచి విస్తృతంగా ఆర్థిక సాయం
- ప్రధాని మోదీ ఆలోచనలతో డిజిటల్ఇండియా
- రాష్ట్ర ప్రభుత్వం త్వరగా రైతు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయని.. డిపాజిట్ల కంటే ఎక్కువగా రుణాలు ఇవ్వడం మంచి పనితీరుకు నిదర్శనమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకుల ప్రాధాన్యం బాగా పెరిగిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కోఠి స్టేట్‌బ్యాంకులో రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలకు బ్యాంకులు లోన్లు ఎలా మంజూరు చేస్తున్నాయనే దానిపై సమీక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. దేశంలోని పేద ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంచేలా ప్రధాని మోదీ జన్‌ధన్‌ఖాతాలు తెరిపించారని, ఆ ఖాతాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు దళారుల దోపిడీ లేకుండా నేరుగా అమలవుతున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణాలు 2020–21లో రూ.40,564 కోట్లు, 2021–22లో రూ.42,853 కోట్లు ఇచ్చారని.. 2022–23లో రూ.40,718 కోట్లు లక్ష్యంకాగా.. ఇప్పటివరకు 58.43 శాతం రుణాలు ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా వ్యవసాయ రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు సహకరించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.



ఇక్కడ బ్యాంకుల క్రెడిట్ రేషియో ఎక్కువ

రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.6,32,834 కోట్ల డిపాజిట్లు ఉంటే.. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా డిపాజిట్ల కన్నా ఎక్కువగా రూ.7,25,568 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణ క్రెడిట్, డిపాజిట్‌రేషియో దేశంలోనే ఎక్కువగా 114.65 శాతంగా ఉందని తెలిపారు. ఇది బ్యాంకుల పనితీరుకు అద్దం పడుతోందని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో రాష్ట్రంలోని అన్ని బ్యాంకులు ఆయా ప్రాధాన్య రంగాలకు రూ.84,143 కోట్ల రుణాలు ఇచ్చాయని.. అందులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.38,737 కోట్లు మంజూరు చేశాయని వివరించారు. ప్రధాన మంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్‌జనరేషన్‌ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), పీఎం స్వానిధి పథకాల కింద ఆయా వర్గాలకు బ్యాంకుల నుంచి గణనీయంగా ఆర్థిక సాయం అందినట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. వీధి వ్యాపారులకు పెద్ద ఎత్తున కేంద్ర సాయం అందించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద బ్యాంకులు 62,516 గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశాయని, లబ్ధిదారులు రూ.1,427.72 కోట్లు సబ్సిడీగా పొందారని చెప్పారు. కాగా.. రాష్ట్రంలో రుణమాఫీ కింద ఎంత మంది రైతులకు, ఎన్ని కోట్ల మేర లబ్ధి అందిందనే వివరాలను కిషన్‌రెడ్డి తెలుసుకున్నట్టు సమాచారం.

'సెట్' కన్వీనర్లను ఖరారు చేసిన టీఎస్‌సీహెచ్‌ఈ!

- ఎంసెట్ నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూకు... కన్వీనర్‌గా బి.డీన్‌కుమార్
- మొత్తం ఏడు సెట్‌లకు కన్వీనర్ల ఎంపిక పూర్తి

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం (2023–24)లో వృత్తి విద్యా కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించే సాధారణ ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణ బాధ్యతలు, కన్వీనర్ల ఎంపిక ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్తి చేసింది. ప్రధానంగా ఏడు రకాల సెట్లకు సంబంధించి యూనివర్సిటీలు, కన్వీనర్ల ఎంపికపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించారు. టీఎస్‌ఎంసెట్‌ను జేఎన్టీయూ నిర్వహించనుండగా... కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి.డీన్‌కుమార్ నియమితులయ్యారు.

వీటితో పాటు మరో ఆరు సెట్లకు కన్వీనర్ల జాబితాను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస రావు ప్రకటించారు.

సెట్-23	యూనివర్సిటీ	కన్వీనర్
టీఎస్ ఎంసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.డీన్‌కుమార్
టీఎస్ పీజీఈసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.రవీందర్‌రెడ్డి
టీఎస్‌ఐసెట్	కేయూ	పి.వరలక్ష్మి
టీఎస్‌ఈసెట్	ఓయూ	శ్రీరాం వెంకటేష్
టీఎస్‌లాసెట్,పీజీఎల్‌సెట్	ఓయూ	బి.విజయలక్ష్మి
టీఎస్ ఎడ్‌సెట్	ఎంజీయూ	ఏ.రామకృష్ణ
టీఎస్ పీఈసెట్	శాతవాహన	రాజేష్ కుమార్



కొత్త మెడికల్ కాలేజీలు | త్వరగా పూర్తి కావాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- 13 డయాగ్నొస్టిక్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి
- ఆసుపత్రులకు మందుల సరఫరాలో పరిమితి ఉండకూడదు
- వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న తొమ్మిది వైద్య కళాశాలల పనులను వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం నుంచి నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం), తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య కళాశాలల పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. గత ఏడాది 8 మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి రికార్డు సృష్టించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయనున్న కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, వికారాబాద్, జనగామ, నిర్మల్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కాలేజీల్లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ వైద్య మండలి బృందం పరిశీలనకు వచ్చేనాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు.

మాతా, శిశు కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలి..

నిర్మాణంలో ఉన్న మాతా, శిశు సంరక్షణ కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నిమ్స్, గాంధీ ఆసుపత్రుల ఆవరణల్లో నిర్మిస్తున్న మాతా, శిశు కేంద్రాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 13 తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను వీలైనంత వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చురీల పనులు, 12 సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌ల పనులను కూడా మంత్రి సమీక్షించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల సమీపంలో తొమ్మిది క్రిటికల్ కేర్ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా, అన్ని ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. మందుల సరఫరాలో ఎలాంటి నియంత్రణ ఉండవద్దని, అవసరమైన మేరకు మందులను ఆయా ఆసుపత్రులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, 24 గంటల్లోగా పరీక్ష ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూసుకోవడం సూపరింటెండెంట్ల బాధ్యత అని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ వైద్య పరికరాలు సమకూర్చుతోందని, ఈ నేపథ్యంలో అవి ప్రజలకు పూర్తిస్థాయిలో సద్వినియోగపడేలా చూడాలని చెప్పారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల | నిర్మాణాలకు టెండర్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాల ప్రక్రియ మరో అడుగు ముందుకు పడింది. ఈ ఆస్పత్రుల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఎల్‌బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో నిర్మించే మూడు ఆస్పత్రులకు నిర్మాణ సంస్థలను ఎంపిక చేసింది. ఈ మూడు ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2,679 కోట్లు అంచనా వేసింది. ఈమేరకు టెండర్లు పిలవగా....రూ.2,004 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టు సంస్థలు ధరలు ప్రకటించాయి. అత్యంత తక్కువ ధరలు ప్రకటించిన సంస్థలకు ప్రభుత్వం నిర్మాణ బాధ్యతలు అప్పగించనుంది.

ప్రాజెక్టు	ప్రభుత్వ అంచనా	కాంట్రాక్టు సంస్థ	నిర్మాణ వ్యయం
టీఐఎంఎస్ ఎల్‌బీనగర్, రంగారెడ్డి జిల్లా	900.00 కోట్లు	లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్	668 కోట్లు
టీఐఎంఎస్ సనత్‌నగర్, హైదరాబాద్ జిల్లా	882.00 కోట్లు	మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా	667 కోట్లు
టీఐఎంఎస్ అల్వాల్, మేడ్చల్ జిల్లా	897.00 కోట్లు	డీఈసీ ఇన్‌ఫ్రా	669 కోట్లు

ఆలయాల్లో న్యాయమూర్తుల పూజలు



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం, సోమశిలలోని ఆలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి నాగార్జున్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సోమశిలలో సోమేశ్వరాలయన్ని, సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న కాటేజీలను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ రమేష్ నాయక్, ఎస్ఐ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల్రబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను శనివారం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణ్‌రావు, కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి దినేష్ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



పట్టువస్త్రాల సమర్పణ



స్టేషన్ మహబూబ్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక తిరుమలదేవుని గుట్ట వేంకటేశ్వరస్వామికి గోదా కల్యాణం కోసం శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా పట్టణంలోని పలు దేవాలయాలను నగర సంకీర్తన పూర్వకంగా వెళ్లి సందర్శిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రధాన అర్చకుడు రాఘవేంద్రశర్మ, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన అర్చక ఆగమ పరీక్షలు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

జోగుళాంబ శక్తిపీఠం: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షలు సోమవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి 359 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పరీక్షల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన సౌకర్యాలను పరీక్ష కేంద్రం దగ్గర ఏర్పాటు చేశారు. అర్చక, ప్రవేశ, వర, ప్రవరలకు సంబంధించి వివిధ ఆగమాల నుంచి అర్చకులు పరీక్షలు రాశారు. ఇందులో 40ఏళ్ల వయసు లోబడి ఉన్నవారంతా రెండు రోజులలో పేపర్–1, 2, 3 రాసి, 7వ తేదీ మధ్యాహ్నం మౌఖిక, క్రియ పరీక్షలకు హాజరయ్యారు. చాత్తద శ్రీవైష్ణవ, శైవ ఆగమం, వీరశైవ ఆగమం, పాంచరాత్ర ఆగమం, తంత్రసార ఆగమం, వైదిక స్మార్థ ఆగమం, వైఖానస ఆగమం, గ్రామ దేవత ఆగమం నుంచి పరీక్షలు రాసినట్టు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్‌లు శకుంతల, వెంకటేశ్వరి, వీణాధరి, శ్రీనివాస్ తెలిపారు. ఇన్విజిలేటర్లు పురేందర్, రంగారావు, రంగాచారి, గ్రేడ్ -2 అధికారులు శేఖర్ గౌడ్, ఉమారాణి, సూపరింటెండెంట్ రఘునాథచారి తదితరులు ఉన్నారు.

మౌఖిక పరీక్షలతో మార్మోగిన సింహగిరి

రెండు రోజులు ఆగమ పరీక్షలలో తొలిరోజు రాత పరీక్షలు ఉండగా, మరుసటి రోజు మౌఖిక పరీక్షలు నిర్వహించడంతో ప్రశ్నలకు సమాధానంగా అర్చక స్వాములు వేదమంత్రాలను ఉచ్చరించి తమ ప్రతిభను చాటడంతో సింహగిరి ఒక్కసారిగా వేదఘోషతో మార్మోగింది.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ స్క్వాడ్

సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయం



మాట్లాడుతున్న కాశి జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి

కృష్ణా: భారతదేశం అంటేనే సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమని కాశీ జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి అన్నారు. శనివారం మండలంలోని చేగుంటలో నిర్వహించిన జన జాగృతి ధర్మ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు అక్కడి పార్వతీ పరమేశ్వర ఆలయంలో 18 మంది జంగమ వటులకు ఉపనయనం నిర్వహించారు. అనంతరం క్షేత్రానికి చెందిన క్షీరాలింగా మహాస్వామి వారి 63వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ధార్మిక సమావేశంలో మాట్లాడారు. మంచి సమాజం నిర్మించాలంటే మొదట ఇంట్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలకు మన సంస్కృతిని, భాషను నేర్పించాలని అన్నారు. ప్రతి వ్యక్తి తన ధర్మాన్ని పాటించాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైన శివుడు లింగ రూపంలో దర్శనమిస్తాడు కానీ, ఇక్కడ పార్వతీ పరమేశ్వరులు నిజరూపంలో ఉండడం అద్భుతమని అన్నారు. కార్యక్రమంలో శాంతమల్ల శివాచార్య మహాస్వామి, చెన్నవీర మహాస్వామి, పంచమ సిద్ధలింగా మహాస్వామి, శంబు సోమనాథ మహాస్వాములు హాజరయ్యారు.



ధార్మిక సమావేశానికి హాజరైన భక్తులు

ఆర్డీఎస్ నీరు అందక అవస్థలు



ఉండవెల్లిలో ఆర్డీఎస్ కెనాల్‌లో తగ్గిన నీటిమట్టం

ఉండవెల్లి: మండలంలోని ఆర్డీఎస్ కెనాల్‌లోని డీ–34 నుంచి డీ–40 వరకు నీరు వచ్చినట్లే వచ్చి నిలిచిపోయాయి. శనివారం అలంపూర్, ఉండవెల్లి మండలాల్లోని పంటలకు నీరు వదిలారు. సాయంత్రం లోపు నీరు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల్లో మొక్కజొన్న, మిరప, మినుములు వేసిన రైతులు ఆర్డీఎస్ కాల్వలో నీరు లేక పంటలు ఎండుదశకు చేరుకున్నాయని తెలిపారు. దాదాపు 1,500 ఎకరాలకు పైగా పంటలకు నీరందించాలని, రైతులు డి. బూడిదపాడులోని ఆర్డీఎస్ అధికారులకు తెలిపినా శుక్రవారం వచ్చిరని, శనివారం సాయంత్రం వరకు నీరు వదల్లేదని రైతులు తెలిపారు. ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా తుంగభద్ర నదిలో నీటి స్థాయి తగ్గిందని తెలిపారు. తుమ్మిళ్ల, జూరాల నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

నవ్వుతో ఒత్తిడిని అధిగమిద్దాం



అంతర్జాతీయ సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి, వీసీ తదితరులు

- పీయూ అంతర్జాతీయ సదస్సులో మలేషియా అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి
- 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించిన వివిధ యూనివర్సిటీల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఒత్తిడిని అధిగమించేందుకు నవ్వు ఒక సాధనంలా ఉపయోగపడుతుందని మలేషియాలోని మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి అన్నారు. శనివారం పాలమూరు యూనివర్సిటీలో 'రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ అండ్‌స్పోర్ట్స్ సైన్స్– 2022' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'మానసిక ఆరోగ్యంపై నాన్– ఫార్మకోలాజిక్ ప్రభావం' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించి మాట్లాడారు. నవ్వు అనేది మనిషిలో ఒక సాధారణ జీవన విధానంలా ఉంటుందని, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఒక ఔషధంలా పని చేస్తుందన్నారు. అంతకు ముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ మనిషి పూర్తి ఆరోగ్యంగా జీవించాలంటే తప్పకుండా మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, సరైన నిద్రతో మనిషిని ఒత్తిడి, రోగాలకు దూరంగా ఉంచుతాయని పేర్కొన్నారు. అనంతరం పీయూతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పీహెచ్‌డీ స్కాలర్స్ కార్యక్రమంలో పాల్గొని దాదాపు 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు పీయూలో మూడు భవనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహాత్మగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి, గురుదీప్‌సింగ్, నీరజ్‌జైన్ లక్నో యూనివర్సిటీ, పీయూ రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పిండి పవన్‌కుమార్, ఓయూ పీడీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా పదోన్నతులపై ప్రకటన



భూత్పూర్‌లో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

భూత్పూర్: ఉపాధ్యాయుల పదోన్నతులకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని, వారం రోజుల్లో ప్రకటన వెలువడనుందని టీపీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని తాటికొండ, అన్నాసాగర్, పోతులమడుగు, ఎల్కిచర్ల, కొత్త మొల్గర, పాత మొల్గర ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ గురుకుల పాఠశాలను సందర్శించారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు టీపీఆర్టీయూ టీఎస్ కృషి చేస్తుందని సంఘం బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గుర్రం చెన్న కేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ గౌడ్, రఘురామిరెడ్డి, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,020అడుగుల వరకు నీరువచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 802 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 120, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.